కథ

# స్వప్నాలంతా ఇంతే!

— నాదెళ్ల లక్ష్మి

దాదాపు ఏడేళ్ళ క్రితం జరిగింది ఆ సంఘటన. ఆ రోజు నాకింకా గుర్తుంది. నేను నా గదిలో కూర్చుని పేపర్ చదువుకుంటుంటే రాఘవ రావు చాలా హడావిడిగా మా ఇంటికి వచ్చాడు. కిరణ్ ఇక్కడికేమైనా వచ్చాడా?" అని అడుగుతున్నాడు. అతని గొంతులో ఆత్రం, భయం పోటీ పడుతున్నాయి.

కిరణ్ రాఘవ కొడుకు. ఇంజనీరింగ్ ఎంట్రెన్స్ రాశాడు. ఆరోజే ఫలితాలు వచ్చాయి.

"కిరణ్ పొద్దుణ్ణించీ రాలేదే! ఎంత ర్యాంకు వచ్చింది?" అని నేను ఎదురు ప్రశ్నించాను.

"రాలేదా?" అంటూ వెంటనే కుర్చీలో కూలబడిపోయాడు రాఘవ.

"కిరణ్‌కి నాలుగు వేల ర్యాంకు వచ్చింది. ఆ ర్యాంకుకి ఇంజనీరింగ్ సీటు ఎక్కడా రాదు. పేపర్లో ఉదయాన తన ర్యాంకు చూసుకుని కాలేజీకి వెళ్ళొస్తానని చెప్పి, పొద్దునన్నగా ఇంట్లోంచి బయల్దేరాడట! ఆ టైమ్‌లో నేను ఇంట్లో లేను. సాయంత్రమైనా రాకపోయే సరికి మీ శరత్ దగ్గరికి ఏమైనా వచ్చాడేమోనని ఇక్కడికి వచ్చాను. నాకేదో భయంగా వుంది. వాడేదైనా అఘాయిత్యం చేయలేదు కదా!" అన్నాడు రాఘవరావు.

"ఛ! అలాంటిదేమీ జరగదు. ఎవరైనా ఫ్రెండ్ ఇంటికి వెళ్ళి వుంటాడు. పద! ఇద్దరం కలసి వెదుకుదాం" అని నేను కూడా రాఘవతో బయల్దేరాను. ఇక్కడ రాఘవ గురించి కొంచెం చెప్పాలి.

రాఘవ రావు ఎలక్ట్రిసిటీ బోర్డులో అకౌంటెంట్. నేను పంచాయితీరాజ్‌లో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాను. మా ఇద్దరిదీ పదిహేను సంవత్సరాల స్నేహం. రాఘవ కొడుకు కిరణ్, మా అబ్బాయి శరత్‌కన్నా మూడేళ్ళు పెద్ద. అయినా వాళ్ళిద్దరి మధ్యా స్నేహం కలిసింది. సెలవొస్తే చాలు! కిరణ్ మా ఇంటికొచ్చేసి మా మేడపై పిట్టగోడ మీద కూర్చుని కబుర్లు చెప్పకుంటూ వుంటారు. రాఘవ వాళ్ళ నాన్న చిన్నప్పుడే పోవడంతో ఇద్దరు చెల్లెళ్ళు, ఇద్దరు తమ్ముళ్ళ బాధ్యత రాఘవకి చిన్న వయసులోనే నెత్తిమీద పడింది. ఆ బాధ్యతలతో పెళ్ళి కూడా ఆలస్యంగా చేసుకున్నాడు. తను పడిన ఆర్థిక ఇబ్బందులు తన కొడుకు పడకూడదని వాడిని బాగా చదివించి పెద్ద ఇంజనీర్‌ని చేయాలని వాడి కోరిక. కిరణ్ తనలాగా ఆర్థిక ఇబ్బందులు పడకూడదనే రాఘవ కోరికలో అసమంజసం ఏమీ లేదు కానీ ఇంజనీర్‌ని చేయాలనుకోవడంతోనే వచ్చింది అసలు చిక్కంతా! కిరణ్‌కి లెక్కలు అంత బాగా రావు. ఇంజనీరింగ్ అంటే ఇష్టం లేదు. అయినా సరే కిరణ్‌ని ఇంటర్మీడియట్‌లో ఎం.పి.సి గ్రూప్‌లో చేర్పించి, ఓ కోచింగ్ సెంటర్‌లో వేలు పోసి కోచింగ్ ఇప్పించాడు. ఇప్పుడు కిరణ్‌కి సీటు రాకపోవడంతో మొదలైంది అసలు సమస్య.


ఇద్దరం కలసి స్నేహితులు, తెలిసిన వాళ్ళ అందరిళ్ళూ వెతికి, చివరికి పోలీసు స్టేషనులో కంప్లయింట్ ఇచ్చి వాడి ఇంటికి వెళ్ళాము. రాఘవకి కొంత ధైర్యంగా వుంటుందని నేను ఆరోజు వాడింట్లోనే వుండిపోయాను. ఆరాత్రి వాడు పడ్డ బాధ వర్ణనాతీతం. కొడుకు ప్రాణాలతో తిరిగి రావాలని అందరు దేవుళ్ళకీ మొక్కుకున్నాడు.

అదృష్టవశాత్తూ మర్నాడే కిరణ్‌ని తీసుకుని వాళ్ళ మామయ్య వచ్చాడు. 'కోచింగ్‌లకి వేలకి వేలు తగలేసినా ఇంజనీరింగ్ సీటు తెచ్చుకోలేకపోయావు!' అని వాళ్ళ నాన్న తిడతాడన్న భయంతో ఇంట్లో కొంత డబ్బులు తీసుకుని వాళ్ళ అమ్మమ్మ గారింటికి పారిపోయాడట! వాళ్ళ మామయ్య "మీ నాన్నతో నేను మాట్లాడతాను" అని ధైర్యం చెప్పడంతో ఇంటికి తిరిగి వచ్చాడట! ఆరోజు ఉదయం వాళ్ళ మామయ్య వెనుక నిల్చుని భయం భయంగానూ, సీటు రాలేదన్న బాధతోనూ వాళ్ళ నాన్నకేసి చూస్తున్న దృశ్యం నా మనసులో ముద్రించుకుపోయింది. ప్రపంచంలో ఇంజనీరింగ్ తప్ప వేరే కెరీర్ లేనట్టు పిల్లల్ని అంత ఒత్తిడికి గురి చేయడం సబబుగా లేదని నాకన్పించింది. చిన్నపిల్లాడి మీద అంత ఒత్తిడి తెచ్చినందుకు రాఘవరావు మీద కోపం కూడా వచ్చింది. నా శరత్‌కి అలాంటి పరిస్థితి ఎప్పుడూ తీసుకురాకూడదని నేను అప్పుడే



నిర్ణయించుకున్నాను.

కిరణ్ ప్రస్తుత పరిస్థితి నా బాల్య స్మృతుల్ని తలవునకు తెప్పించింది. నాకు చిన్నప్పటి నుంచీ నాటకాలంటే చాలా ఆసక్తి వుండేది. స్కూల్లోనూ, మా వూళ్ళోనూ జరిగే నాటకాల పోటీలలో క్రమం తప్పకుండా పాల్గొనేవాడిని. ప్రతిసారీ ఉత్తమ నటుడిగా బహుమతి నాకే వచ్చేది. పెద్దయ్యాక సినిమాలలో చేరి ఎస్వీ రంగారావులా గొప్ప నటుడిగా పేరు తెచ్చుకోవాలని చాలా కోరికగా వుండేది. కానీ మా నాన్న నా అభిరుచిని ఏమీ పట్టించుకోకుండా ఇంజనీరింగ్ కాలేజీలో చేర్పించాడు. చదువైన వెంటనే ఉద్యోగం, పెళ్ళి, పిల్లు పుట్టడం వెంట వెంటనే జరిగిపోయాయి. దాంతో మద్రాసు వెళ్ళి సినిమాలలో అవకాశం కోసం ప్రయత్నించాలనే





నా ఆశ అడియాశ అయ్యింది. మా ఆఫీసులోనూ, జిల్లాలోనూ జరిగే ఫంక్షన్లలో నాటకాలు వేసి నా కళాభిరుచిని సంతృప్తి పర్చుకుంటూ వుంటాను. నిజం చెప్పాలంటే నాకు జీవితంలో పెద్ద సమస్యలేమీ లేవు. ఇంజనీరింగ్ సంపాదన బావే వుంది. చక్కని భార్య. ఇద్దరు పిల్లలు. కానీ ఎక్కడో అసంతృప్తి మిగిలిపోయింది. మా అబ్బాయి శరత్ బొమ్మలు చాలా బాగా వేస్తాడు. వాడికి కార్టూనిస్టు అవ్వాలని కోరిక. నా ఆశయం ఎలాగూ సాధించలేకపోయాను. శరత్‌నైనా వాడి ఆశయం



## షారుక్‌ఖాన్ గెస్టు రోలు

మాధురీ దీక్షిత్, ఇందర్‌కుమార్‌లతో ప్రఖ్యాత చిత్రకారుడు ఎమ్.ఎఫ్.హుస్సేన్ తీస్తున్న 'గజగామిని' సినిమాకి వ్యాపారం బాగా అవడం కోసం క్రొత్తగా షారుక్‌ఖాన్‌ని కూడా కలిపారు. అయితే షారుక్ మాత్రం ఇది కేవలం అతిథి పాత్ర మాత్రమే. హుస్సేన్‌సాబ్ మాట కాదనలేక చేస్తున్నానంతే అంటున్నాడు.

సాధించేలా ప్రోత్సహించాలనీ, ఆదర్శ తండ్రిగా పేరు తెచ్చుకోవాలనీ నిర్ణయించుకున్నాను.

ఆ ఏడాది కొత్త ఇంజనీరింగ్ కాలేజీలు మంజూరు చేయడంతో సీట్లు పెరిగి కిరణ్‌కి వేరే వూళ్ళో సీటు వచ్చింది. నేను హాస్టల్‌లో వుండను, ఇక్కడే వుండి బి.ఎస్‌సి. నే చదువుకుంటానని కిరణ్ ఎంత మొత్తుకున్నా వినకుండా రాఘవ కిరణ్‌ని తీసుకువెళ్ళి ఇంజనీరింగ్‌లో చేర్పించాడు. పది రోజుల తర్వాత రాగింగ్‌నీ, హాస్టల్ తిండినీ భరించలేక కిరణ్ ఇంటికి తిరిగి వచ్చేస్తే మళ్ళీ బలవంతంగా తిరిగి అదే కాలేజీలో చేర్పించాడు. "కిరణ్‌కి ఇష్టం లేనప్పుడు అంత బలవంతం ఎందుకు? వాడిని ఇక్కడే బి.ఎస్‌సి. చదువుకోనివ్వొచ్చుగా" అని నేను రాఘవతో చాలాసార్లు దెబ్బలాడేవాడిని. "కిరణ్ చిన్న పిల్లాడు. వాడికి లోకజ్ఞానం లేదు. నేను ఇదంతా వాడి మంచి కోసమే చేస్తున్నాను" అని నా వాదనలన్నీ కొట్టి పారేశాడు రాఘవ.

మా శరత్‌ని నేను మామూలుగా ఇంటర్‌లో చేర్పించాను. వాడు సహజంగా తెలివైనవాడు. లెక్కలు బాగా చేస్తాడు. దాంతో ఎమ్.పి.సి. గ్రూప్‌లోనే చేరాడు. వాడికి ఇంజనీరింగ్ మీద అంత ఆసక్తి లేకపోవడంతో నేను కోచింగ్‌లూ, ట్యూషన్లూ పెట్టలేదు. వాడిమీద అనవసరమైన ఒత్తిడి తెచ్చి వాడి సృజనాత్మక శక్తిని చంపేయదల్చుకోలేదు. కార్టూన్లు వేయడం బాగా ప్రాక్టీసు చేయమని, దానికావలసిన సరంజామా కొనిచ్చి ప్రోత్సహించాను. అలాగని శరత్ కూడా చదువుని పూర్తిగా నిర్లక్ష్యం చేయలేదు. ట్యూషన్లు లేకపోయినా ఫస్ట్ క్లాస్ తెచ్చుకున్నాడు. శరత్ ఇంటర్మీడియట్ అయిపోయాక వాడిష్ట ప్రకారమే మా ఊళ్ళోనే బి.ఎస్‌సి.లో చేర్పించాను.

ఆ సారికి సెలవులకు వచ్చినప్పుడు కిరణ్ మా ఇంటికి వచ్చాడు. వాళ్ళు యథా ప్రకారం మేడపై పిట్టగోడ మీద కూర్చుని మాట్లాడుకుంటుంటే నా గదిలో పేపర్ చదువుకుంటున్న నాకు వాళ్ళ మాటలు వినపడుతున్నాయి.

"బి.ఎస్‌సి.లో ఎందుకు చేరావు? ఇంజనీరింగ్ సీటు రాలేదా? నీకు లెక్కలు, సైన్సు బాగా వస్తాయి కదా?" అని కిరణ్ శరత్‌ని అడుగుతున్నాడు.

"నేనసలు ఇంజనీరింగ్‌కి ఎంట్రెన్స్ రాయలేదు. నాకు ఇంట్రెస్ట్ లేదు. మా నాన్న గారు కూడా నేను బి.ఎస్‌సి.లో చేరతానంటే ఒప్పుకున్నారు. నన్ను కార్టూన్లు వేయమని కూడా బాగా ఎంకరేజ్ చేస్తారు" అని శరత్ చెబుతున్నాడు.

"నిజంగానా! మీ నాన్నగారు ఎంత మంచివారో! మా నాన్నకి ఎప్పుడు నేను ఇంజనీరై లక్షలకి లక్షలు సంపాదిస్తానా! అని వుంటుంది. కానీ నా సంతోషం గురించి ఎప్పుడూ ఆలోచించరు. మా నాన్న కూడా మీ నాన్నగారిలా వుంటే నేను కూడా హాయిగా ఇంట్లో మా అమ్మ దగ్గర వుండి చదువుకునే వాడిని" అని కిరణ్ అంటున్నాడు. ఆ మాటల కన్నా నా గురించి మా అబ్బాయి చెబుతున్నప్పుడు వాడి గొంతులో తొణికిసలాడిన ఆనందం, కించిత్తు గర్వం తల్చుకుంటే నా మనసంతా ఆనందంతో నిండిపోయింది. ఆదర్శ తండ్రిని కావాలనే నా లక్ష్యం నెరవేరినట్టు అనిపించింది.

తర్వాత కిరణ్ ఇంజనీరింగ్ అయిపోయింది. మళ్ళీ రాఘవ బలవంతం మీద టోఫెల్, జి.ఆర్.ఇ. పరీక్షలు రాసి అమెరికాలో ఎమ్మెస్ చదవడానికి వెళ్ళాడు కిరణ్. అమెరికా వెళ్ళినా నెలకొకసారైనా మా వాడికి ఉత్తరాలు రాస్తూ వుంటాడు. ఆ తర్వాత మావాడి బి.ఎస్‌సి. అయిపోయింది. డిస్టింక్షన్‌లో ప్యాసయ్యాడు. శరత్ ఎమ్.ఎస్‌సి, ఎమ్.సి.ఎ. పరీక్షలూ, బ్యాంకు, ఎల్.ఐ.సి. పరీక్షలకూ ప్రిపేరవుతున్నాడు. ఎల్.ఐ.సి. పరీక్షలో క్వాలిఫై అయ్యి ఇంటర్వ్యూకి కూడా అటెండయ్యాడు. దాని ఫలితాల కోసం ఎదురు చూస్తున్నాం. ఈలోపుగా కార్టూన్లు వేయడంలో కూడా పరిణతిని సాధించాడు. పత్రికలలో అడపాదడపా వాడి కార్టూన్లు ప్రచురితమయ్యాయి. అవి పత్రికలలో చూసినప్పుడల్లా నాకు ఎవరెస్ట్ ఎక్కినంత సంతోషంగా వుండేది. పల్లిపైన వాడి కార్టూన్లనన్నింటినీ ఎన్లార్జ్ చేయించి ఫ్రేముకట్టించి పెట్టాను.

తర్వాత కొన్నాళ్ళకి కిరణ్ అక్కడ ఉద్యోగం వచ్చిందనీ, చదువు పూర్తయ్యిందనీ, ఉద్యోగం వచ్చిందనీ రాస్తూ అక్కడ తీసుకున్న ఫోటోలు కొన్ని పంపించాడు. ఇంచుమించుగా అప్పటినుంచీ శరత్ ప్రవర్తనలో కొంత తేడా వచ్చింది. ఎప్పుడూ ముభావంగా, ఏదో పోగొట్టుకున్న వాడిలా ప్రవర్తిస్తున్నాడు. కార్టూన్లు వేయడం పూర్తిగా మానివేశాడు. అయితే నా ఉద్యోగ బాధ్యతలో నేను ఆ విషయం పట్టించుకోలేదు. ఆరోజు ఒక ఇంగ్లీషు మ్యాగజైన్ వాళ్ళు కార్టూన్ల పోటీ నిర్వహిస్తున్నట్టు ప్రకటన చూశాను. ఆ ప్రకటన తెచ్చి శరత్‌కిచ్చి పోటీలో పాల్గొనాలని చెప్పాను. వాడు చాలా అనాసక్తంగా, ముభావంగా దాన్ని తీసి పక్కన పడేశాడు. పోటీకి ఆఖరు తేదీ దగ్గరకొచ్చిందని నేను గుర్తు చేసినా 'చూద్దాంలే!' అని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చాడు. నాకేం జరిగిందో అర్థం కాలేదు.

మర్నాడు నేను ఎదురు చూస్తున్న శుభవార్త తెలిసింది. శరత్‌కి ఎల్.ఐ.సి.లో ఉద్యోగం వచ్చింది. నేను చాలా సంతోషంగా వచ్చి వాడికి ఆ వార్త చెప్పి అభినందించాను. వాడి మొహంలో ఏకోశానా సంతోషం కన్పించలేదు. "నేను ఆ ఉద్యోగంలో జాయినవ్వను నాన్నా" అని చెప్పాడు. నేను తెల్లబోయాను.

"మంచి జీతం, గవర్నమెంట్ ఉద్యోగం, మన వూళ్ళోనే నీకు పోస్టింగ్ వచ్చేట్లు తెలిసిన వాళ్ళ చేత చెప్పిస్తాను. ఉద్యోగం ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకే కాబట్టి పగలూ, సాయంత్రం కార్టూన్లు కూడా వేసుకో వచ్చు. ఇంతకన్నా ఏం కావాలి?" అని నేను



వాడిని ఎదురు ప్రశ్నించాను.

"మీకసలు నామీద శ్రద్ధ లేదు. ఈ వూరి పొలిమేరలు దాటకుండా నేను ఎప్పుడూ మీ దగ్గరే వుండాలనే తప్ప, నా అభివృద్ధి గురించి మీరెప్పుడూ పట్టించుకోరు. నేనీ ఉద్యోగంలో చేరను. ఎమ్.సి.ఎ. ఎంట్రన్స్ పరీక్ష రాసి అందులో చేరతాను" అన్నాడు శరత్.

"నువ్వు చదువుకోవాలంటే చదువుకో! కానీ ఆ ఎమ్.సి.ఎ. అయ్యాకైనా ఉద్యోగం వెదుక్కోవాలి కదా! నువ్వీ ఉద్యోగంలో ఎందుకు జాయినవ్వనంటావో నాకు అర్థం కావట్లేదు" అన్నాన్నేను.

"అంతే! మీకిలాంటివి అర్థం కావు. ఈ ఫొటోలు చూడండి" అంటూ శరత్ కిరణ్ పంపించిన ఫొటోలు విసురుగా అందించాడు. కిరణ్ కొత్తగా కొనుక్కున్న కారు ముందు, కారు లోపల కూర్చుని తీయించుకున్న ఫొటోలవి. నాకు విషయం సగం అర్థమయింది. సగం అర్థం కాలేదు.

"ఈ ఫొటోలు నేనింతకు ముందే చూశాను. నీకు కారు కొనుక్కోవాలని వుంటే నోటిగా అడగొచ్చు గదా! నా ప్రావిడెంట్ ఫండ్‌లో అడ్వాన్స్ తీసుకుని, ఇంకొంచెం అప్పు చేసి కారు ఎలాగైనా కొంటాలే" అని నేను వాడికి హామీ ఇచ్చాను.

"నేను ఇందాకటి నుంచీ చెప్పాలనుకుంటున్న పాయింట్ అదే! మీరు ఇక్కడ ఇంజనీర్‌గా ముప్ఫయ్ ఏళ్ళు సర్వీస్ చేశాక కూడా కారు కొనుక్కోవాలంటే ఎక్కడో అక్కడ అప్పు చేయకపోతే కుదరదు. ఇంక ఎల్.ఐ.సి.లో క్లర్క్‌గా నేను ఉద్యోగం చేస్తే నేను ఎన్నాళ్ళకి కారు కొనుక్కోగలుగుతాను? కిరణ్‌ని చూడండి. వాడి వయసెంత? నాకన్నా మూడేళ్ళే కదా పెద్ద! ఎమ్.ఎస్. చేస్తూనే వచ్చే ఎయిడ్ దాచుకుని కారు కొనుక్కున్నాడు. అందుకని నేను కూడా ఎమ్.సి.ఎ. చదివి సాఫ్ట్‌వేర్‌లో ఉద్యోగం తెచ్చుకుంటే చాలు. ఏడాది, రెండేళ్ళ అనుభవం వున్నా అమెరికా వెళ్ళొచ్చు. మీరు కూడా నన్ను ఇంజనీరింగ్ చదివించి వుంటే కిరణ్‌లా వెంటనే అమెరికా వెళ్ళిపోయి వుండేవాడ్ని. అందుకనే ఈ ఎల్.ఐ.సి. ఉద్యోగంలో చేరను" అని కచ్చితంగా చెప్పాడు. తర్వాత కార్టూన్లు వేయడం పూర్తిగా మానేశాడు. పగలూ, రాత్రీ చదివి ఎమ్.సి.ఎ. సీటు తెచ్చుకున్నాడు. పట్టుదలతో సీటు సాధించినందుకు నేను సంతోషించినా, కొంచెం బాధ కూడా అనిపించింది. కంప్యూటర్ అంటే ఆసక్తితో చదివితే అది వేరు. కానీ వాడు కూడా మాలాగే డబ్బూ, హోదా, అంతస్తు..ఇవే ముఖ్యమనుకునే రాట్‌రేస్ లోకి దిగి వాడిలో సహజంగా వున్న కళాకారుడిని చంపేస్తున్నందుకు కొంచెం బాధ కలిగింది. అయినా వాడిష్టమని వూరుకున్నాను.

తర్వాత ఏడాదికి మళ్ళీ కిరణ్ ఇండియా వచ్చినప్పుడు మా ఇంటికి వచ్చాడు. వాళ్ళు యథాప్రకారం మేడపై పిట్టగోడ మీద కూర్చుని మాట్లాడుకుంటున్నారు. నేను నా గదిలో కూర్చుని పేపర్ చదువుకుంటుంటే వాళ్ళ మాటలు వినపడుతున్నాయి.

"నీ సహాయానికి చాలా థ్యాంక్స్‌రా! నీ ఉత్తరం వల్ల నా కళ్ళు తెరుచుకున్నాయి. మా నాన్న మాట వింటే ఆ క్లర్క్ ఉద్యోగంలో చేరి అప్పుడప్పుడు పేపర్లలో పడే కార్టూన్లే గొప్ప అఛీవ్‌మెంట్ అనుకుని జీవితం గడిపేసి వుండేవాడిని. ఇప్పుడు కనీసం ఇంకో మూడేళ్ళకైనా అమెరికా రావచ్చు. మా నాన్న ఎప్పుడూ తను నటుడిగా సాధించలేని గుర్తింపూ, కీర్తీ నా వల్ల పొందాలనుకున్నాడే కానీ నా అభివృద్ధి గురించి ఎప్పుడూ ఆలోచించలేదు" అంటున్నాడు నా పుత్రరత్నం శరత్.


"మా నాన్నా అంతే. తను చిన్నప్పుడు డబ్బుకు ఇబ్బంది పడ్డాడు కాబట్టి నన్ను బలవంతంగా అమెరికా పంపించాడు. ఇప్పుడు మంచి ఉద్యోగం వచ్చింది కాబట్టి ఇంక పెళ్ళి చేసుకోమంటాడు. నాకు డాలర్లలో వచ్చే జీతం రూపాయిలలో మార్చుకుంటే గొప్ప కానీ అమెరికాలో అది మధ్య తరగతి బతుకే. అందుకే రెండేళ్ళ తర్వాత ఇండియా వచ్చేసి సొంతంగా బిజినెస్ పెట్టుకుని దానిలో నిలదొక్కుకున్నాక పెళ్ళి చేసుకుంటానంటే వినిపించుకోడు. ఈ వ్యాపారాలు మనకెందుకు? హాయిగా ఉద్యోగం చేసుకో. నేను ఆర్థిక ఇబ్బందులతో, కుటుంబ బాధ్యతలతో పెళ్ళి ఆలస్యంగా చేసుకున్నాను. జీవితంలో సుఖపడలేదు. నువ్వైనా వ్యాపారం అంటూ బాధ్యతలు పెంచుకోకు. ఉద్యోగం చేసుకుంటూ తొందరగా పెళ్ళి చేసుకుని సుఖపడమంటాడు. ఈ నాన్నలంతా ఒక్కటే. వాళ్ళు, వాళ్ళ జీవితంలో తీర్చుకోలేని కోరికలన్నింటినీ మన ద్వారా తీర్చుకోవాలనుకుంటారే కానీ, మన సంతోషం గురించి ఆలోచించరు" అంటున్నాడు కిరణ్.

నేను ఆ మాటలు వింటూ స్థాణువైపోయాను. డబ్బు, అంతస్థే ముఖ్యమనుకునే వ్యాపార ధోరణితో వాడిలో సహజంగా వున్న సృజనాత్మక శక్తి చచ్చిపోకూడదనే ఆశని వాడు వేరేగా అర్థం చేసుకున్నందుకు బాధపడాలో, రాఘవ రావు కూడా మంచి తండ్రి కాదనే కిరణ్ అభిప్రాయం వల్ల తల్లిదండ్రులని అపార్థం చేసుకోవడం ఈ తరం యువతకి వున్న జాడ్యం అనాలో అర్థం కాలేదు నాకు.

మళ్ళీ నిదానంగా ఆలోచిస్తే నేనూ వాళ్ళలానే ఆలోచించాను కదా! అనిపించింది. మద్రాసు వెళ్ళి సినిమాలలో చేరి పేరు తెచ్చుకోవాలంటే చాలా కష్టం. చాలా పట్టుదల, అదృష్టం కావాలి. అందుకనే నేను సినిమా ఫీల్డులో జాయినవుతానంటే మా నాన్న ఒప్పుకోలేదు. దానికోసం ఇన్నేళ్ళ తర్వాత కూడా నేను మా నాన్నని తిట్టుకుంటున్నాను. అందుకనే ఏ తరంలోనైనా నాన్నలు మంచి ఉద్దేశంతో ఏం చెప్పినా, ఏం చేసినా అర్థం చేసుకోకపోవటం అందరు కొడుకులకీ వున్న జాడ్యమే అని నాకు అనిపించింది.

## ఆటోలో తిరుగుతున్న మనోజ్ బాజ్‌పాయ్

'సత్య' సినిమా తరువాత అనుకున్న దాని కంటే ఎక్కువ పాపులారిటీ సంపాదించిన మనోజ్ బాజ్‌పాయ్‌కి స్వంతంగా కారు లేక ఇంకా ఆటోల్లోనే తిరుగుతున్నాడు. ఇప్పుడిప్పుడే జనం గుర్తుపట్టి గోల చేస్తుండడంతో ఇతని సెక్రెటరీ భాస్కర్ శెట్టి గొడవ పెట్టడంతో మొత్తానికి ఈ నెలలో కారు కొనడానికి ఒప్పుకున్నాడట మనోజ్.



## ప్రీతిజింటా తెలివితేటలు

సినిమా నటన ఇచ్చే కిక్కుని ఒకసారి రుచి చూశాక ఇంక వెనక్కి వెళ్ళే అలవాటు సాధారణంగా ఉండదు కదా! దానికోసం ఏం చేయడానికైనా సిద్ధమే నంటారు. అందుకే ప్రీతి జింటా గాలం వేసి మరీ గోవిందాని పట్టింది. గోవిందా కనుక సరిగ్గా ముగ్గులోకి దిగాడా అరడజను సినిమాలు ఎక్కడికీ పోవు అంటోంది ప్రీతి.